# ఉల్లాసంగా..ఉత్సాహంగా..

• ఘనంగా నూతన సంవత్సర వేడుకలు • ఆలయాలకు పోటెత్తిన భక్తులు • ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులు



తాండూరు: కొత్త ఏడాది వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప

న్యూస్‌నెట్‌వర్క్, నమస్తేతెలంగాణ: నూతన సంవత్సరం వేడుకలను ప్రజలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. 2023 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త ఏడాది 2024 కి సాదరంగా స్వాగతం పలికారు. ఇండ్లలోనే కొందరు కేక్‌లు కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటి కొత్త ఏడాదిలోకి ప్రవేశించిన వెంటనే మిత్రులు, బంధువులకు ఫోన్‌లలో సందేశాలు పంపుతూ కొత్త ఏడాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సోమవారం ఉదయం కొందరు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. నూతన సంవత్సరంలో మంచి జరగాలని దేవుణ్ని ప్రార్థించారు. ఇండ్ల ముందు కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ ముగ్గులు వేశారు. కొత్త ఏడాది వేడుకల సందర్భంగా ఆదివారం రాత్రి వరకు బేకరి షాపులు, కిచెన్ సెంటర్లు, మటన్ దుకాణాలు రద్దీగా కనిపించాయి. కొడంగల్‌లో మహాలక్ష్మివేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శంకర్ సిబ్బందితో ఆది వారం రాత్రి కేక్ కట్ చేసి కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. నూతన వాహనాలు తీసుకొని దేవాలయాల దగ్గర పూజలు చేయించారు



బొంరాస్‌పేట: కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ కేక్‌కట్ చేస్తున్న ఎస్సై శంకర్



కొడంగల్: వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కులకచర్ల: పాంబండ శ్రీరామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

## నేటి నుంచి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

పెద్దేముల్, జనవరి1 : ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారెంటీల దరఖాస్తులను మంగళవారం నుంచి స్వీకరించనున్నట్లు మండల తహసీల్దార్ కె.కిషన్ తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రుద్రారం, బండపల్లి,మారేపల్లి గ్రామ పంచాయతీల దగ్గర, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నాగులపల్లి, గోపాల్‌పూర్ గ్రామ పంచాయతీల వద్ద దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆరు గ్యారంటీ పథకాలను ఆన్‌లైన్ చేస్తామని ప్రజలను మోసం చేసేందుకు కొంతమంది దళారులు ప్రయత్నిస్తున్నారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ పథకాలకు ఆన్‌లైన్‌లో ఎలాంటి దరఖాస్తులు సమర్పించాల్సిన అవసరం లేదన్నారు. కులం, ఆదాయ ధృవీకరణ పత్రాలు కూడా అవసరం లేదని, కేవలం ఆధార్‌కార్డు, రేషన్ కార్డులు జత పరిస్తే సరిపోతుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఒకవేళ ఎవరైనా దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తామని ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తే అలాంటివారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని తహసీల్దార్ కిషన్ హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మర్పల్లి, జనవరి 1: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని బైక్ ఢీకొనడంతో మృతి చెందినఘటన మం డల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోటమ ర్పల్లి గ్రామానికి చెందిన చాకలి బాబు ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో మర్పల్లి స్టేషన్ రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా లడ్డూరామ్ అనే వ్యక్తి బైక్‌ను అజాగ్రత్తగా నడుపుతూ బాబును వెనుక నుంచి ఢీకొన్నాడు.. తీవ్రగాయాలైన బాబును స్థానికులు మర్పల్లి ప్రభుత్వ దవాఖా నకు తరలించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ధవాఖానకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు.. మృతుడు బాబు తండ్రి నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎసై శ్రీధర్ రెడ్డి తెలిపారు..



మర్పల్లి, జనవరి1: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం మండల నాయకులు అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే ప్రసాద్ కుమార్‌ను నగరంలోని ఆయన నివసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాములు యాదవ్, రవీందర్, ఖలీమొద్దీన్, అశోక్, రాచన్న, సర్వేశ్వర్, లడ్డు పటేల్, తదితరులు ఉన్నారు.

## ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి



మోమిన్‌పేట, జనవరి 1: ప్రతి ఒక్కరూ అధ్యాత్మిక చింతనను అలవర్చుకోవా లని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మం డల పరిధిలోని చక్రంపల్లి గ్రామం వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు

## అయోధ్య శ్రీరాముడి అక్షింతలు పంపిణీ



పరిగి టౌన్, జనవరి 1: అయ్యోధ్య నుంచి తీసుకొచ్చిన శ్రీరాముడి అక్షింతలను సోమవారం పరిగి మున్సిపల్ పరిధిలోని మూడో వార్డులో బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం ఉంటుందని ఆరోజున ప్రతి ఒక్క హిందువు భక్తిభావంతో సాయంత్రం వేళలో ఇంటి ముందు దీపాలు వెలిగించాలని బీజేపీ నాయకులు రాంచందర్, ఆంజనేయులు, కిష్టయ్య సూచించారు. శ్రీరామ నామ స్మరణతో ఇంటింటికి వెళ్లి అక్షింతలు పంచడం వల్ల భక్తులు నూతన సంవత్సరం రోజున ఆ శ్రీరాముని ఆశీస్సులు తమపై ఉం టాయని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిపాల్, అంజయ్య పాల్గొన్నారు.



వికారాబాద్ జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ శాసన సభా పతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ సోమవారం రాజ్ భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు శుభాకాంక్షలు తెలిపారు.



తాండూరు, జనవరి1: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హైదరాబాద్‌లో గవర్నర్ తమిళిసై, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, దుద్దిల్ల శ్రీధర్ బాబులను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

### ఎస్‌బీఐలో సిబ్బందిని పెంచాలని

## రేపటి నుంచి రిలే నిరాహార దీక్షలు

బొంరాస్‌పేట, జనవరి 1 : బొంరాస్‌పేట ఎస్‌బీఐలో సిబ్బంది సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తూ బుధవారం నుంచి బ్యాంకు ముందు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ప్రజా సంఘాల నాయకులు వెల్లడించారు. సోమవారం వారు బొంరాస్‌పేటలో విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకులో తగినంత సిబ్బంది లేక డబ్బులు జమ చేయాలన్నా, తీసుకోవాలన్నా గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులో ఆరు వేల మంది ఖాతాదారులు ఉన్నా తగినంత సిబ్బంది లేక ఖాతాదారులకు సేవలు అందడం లేదని వారు అన్నారు. పంట రుణాలు సకాలంలో అందడం లేదని వాపోయారు. బ్యాంకు ఉన్నతాధికారులను కలిసి సిబ్బంది సంఖ్యను పెంచి మెరుగైన సేవలు అందించాలని కోరినా స్పందన లేదని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు బుధవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేస్తామని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, కేవీపీఎస్ నాయకులు లక్ష్మయ్య, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, చిన్నయ్య తదితరులు తెలిపారు.

## శిఖం భూమిని కాపాడాలని రైతుల ఆందోళన



దోమ, జనవరి 1: మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామానికి చెందిన కుడిచెర్వు శిఖం భూమి ఆరు ఎకరాలను గ్రామానికి చెందిన భగవంత్‌రెడ్డి కబ్జా చేశారని దిర్సంపల్లి రైతులతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, మండల నాయకుడు హెచ్ సత్తయ్య తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న తహసీల్దార్ ఈ భూమిని సర్వే చేసి కబ్జా నుంచి విడిపించినప్పటికీ గత కొద్ది రోజులుగా సదరు వ్యక్తి మరోసారి శిఖం భూమిని కబ్జా చేశాడని ఆరోపించారు. తహసీల్దార్ పురుషోత్తంకు, ఇరిగేషన్ ఏఈకి ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా తహసీల్దారు, ఇరిగేషన్ అధికారులు స్పందించి కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకలు కోరారు. అనంతరం ఇదే విషయంపై దోమ ఎస్సై రవిగౌడ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు సత్తయ్య, రఘురామ్, శేఖర్, అంజిలయ్య, చిన్నయ్య, బిచ్చమ్మ, వెంకటమ్మ, కార్మీక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల సర్వ సభ్య సమావేశం

వికారాబాద్, జనవరి 1: వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్తయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధి శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావే శానికి హాజరు కావాలని ఆయన కోరారు.